క్లుప్తంగా

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

నవాబుపేట: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆస్పత్రుల్లో డబ్బులు చెల్లించిన పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వార చెక్కులు అందించినట్లు జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య అందించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల 77 వేల విలువైన చెక్కులను అందించారు. కార్యక్రమంలో కోఆప్షన్ తాహేర్, ప్రతాప్, సర్పంచ్‌లు గోపాల్‌గౌడ్, కృష్ణ, రాములు, వెంకటేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత

నవాబుపేట: మండల పరిధిలోని కారుకొండకి చెందిన మైనోద్దిన్ అనారోగ్యంతో గతేడాది మృతి చెందాడు. కాగా ఆయన కూతురు వివాహం గురువారం జరగనుంది. దీనికి గాను గ్రామానికి చెందిన మైనోద్దిన్ స్నేహితుడు న్యాయవాది విక్రమ్ దంపతులు రూ.25 వేల ఆర్థిక సహాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఆయన అన్నారు. అనంతరం బాధితుడి కుమార్తెకు దుస్తులు అందజేశారు.

వడ్డీరేట్లను సద్వినియోగం చేసుకోవాలి

జడ్చర్ల టౌన్: పోస్టాఫీసులో వడ్డీరేట్లు పెరిగాయని బాదేపల్లి పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ బుధవారం పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడునెలలకోసారి వడ్డీరేట్లు సవరిస్తుందని, అందులో భాగంగా జనవరి 1 నుంచి పోస్టాఫీస్ వడ్డీరేట్లను పెంచిందన్నారు. ఈనెల 30వరకు పోస్టాఫీస్‌లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు.

భవన కార్మిక సంఘం వాల్‌పోస్టర్ విడుదల

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదిన చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం వాల్ పోస్టర్‌ను బుధవారం మండల కేంద్రంలో ఆ సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కోళ్ల వెంకటన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల కుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు జేఎన్ దేవదానం, చంద్రన్న, శ్రీహరి, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జడ్చర్ల: స్థానిక విజయనగర్‌కాలనీ వద్ద బుధవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనపరుచుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని ఆల్వాన్‌పల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓటుహక్కును వినియోగించుకోండి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్


కోడూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రధానమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.రాజేశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని కోడూర్ గ్రామపంచాయతీలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఓటుహక్కు వినియోగం గురించి ప్రమాణాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యానికి ఓటుకు ఎంతో ప్రత్యేకత ఉందని అన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బి.శ్రీకాంత్‌గౌడ్, ప్రత్యేక అధికారి పాండు, తహసీల్దార్ పాండు, ఎంపీడీఓ జ్యోతి, ఎంపీఓ నరేందర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌సుందర్ రెడ్డి, ఆర్‌ఐ క్రాంతికుమార్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ నర్సింలు, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్, మన్యంకొండ పాలక మండలి సభ్యుడు చిన్నయ్యగౌడ్‌తో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే గాజులపేటలో ఓటరు దినోత్సవం పురస్కరించుకుని సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు బంగారు పెద్ద వెంకటయ్యలు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

దేవరకద్ర: స్థానిక నియోజకవర్గ కేంద్రంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం నుంచి అధికారులతో పాటు విద్యార్థులు ర్యాలీ ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన రహదారుల ద్వార ర్యాలీ నిర్వహించి పాత బస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ రహమాన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు ర్యాలీలు నిర్వహించి ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు.

నవాబుపేట: మండల కేంద్రంతో పాటు గురుకుంట, ఇప్పటూర్, జంగమయ్యపల్లి, మరికల్, కాకర్లపహడ్ గ్రామాలలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీలు, ప్రతిజ్ఞలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్యలు మాట్లాడుతూ ఓటు హక్కు విశిష్టతను అందరికి వివరించాలన్నారు. అనంతరం నవాబుపేటలో అంబేద్కర్ చౌరస్తాలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీటీ లిఖితారెడ్డి, ఎంపీడీఓ శ్రీలత, సర్పంచ్ గోపాల్‌గౌడ్, రైతు బంధు మండల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌ఐ గోవర్ధన్, యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, అంజయ్య, పంచాయతీ అధికారి నరేష్, నర్సింహులు, గిరి, లక్ష్మయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు కరన్‌జీ, సృగ్నేష్, శ్రీనివాస్‌రెడ్డి అక్తర్, రమేష్ పాల్గొన్నారు.

రాజాపూర్: ఓటు ఒక వజ్రాయుధమని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పెరి బచ్చిరెడ్డి, మండల తహసీల్దార్ రాంబాయి పేర్కొన్నారు. బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటుహక్కుపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఆనంద్, నాయకులు లింగం, సత్యయ్య, నర్సింలు, అచ్చయ్య పాల్గొన్నారు.

చిన్నచింతకుంట: మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవాని బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో తాహసిల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలి నిర్వహించారు. అనంతరం ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సువర్ణరాజు, ఎంపీడో శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై భాగ్యలక్ష్మారెడ్డి, ఆర్‌ఐ తిరుపతయ్య, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బాలానగర్:** మండల కేంద్రంలోని ముఖ్య కూడలిలో తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఓటుహక్కుపై అవగాహన కల్పించడంతోపాటు నూతన ఓటరు నమోదు కార్యక్రమాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు.


మూసాపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


రాజాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ రాంబాయి


చిన్నచింతకుంటలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- శ్రీచెన్నకేశవస్వామి స్వామివారి కల్యాణం, రథోత్సవానికి ఏర్పాట్లు
- 30న శకటోత్సవం, తీర్థావళి, సాంస్కృతిక కార్యక్రమాలు
- జాతరకు ప్రత్యేకంగా ఎడ్ల బండలాగుడు పోటీలు


చెన్నకేశవస్వామి దేవాలయం


స్వామి వారి విగ్రహం

అడ్డాకుల: మండల పరిధిలోని రాచాలలో వెలిసిన శ్రీచెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఈనెల 28 నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు మొదలు కానున్నాయి. ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో జాతర కొనసాగనుంది. జాతర కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈనెల 28న స్వామి వారి కల్యాణం, రథోత్సవం(తేరు), 29న స్వామి వారి ఉద్దాలోత్సవం, 30న ఆలయం వద్ద శకటోత్సవం, తీర్థావళి, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు జాతరకు అధిక సంఖ్యలో తరలిరానున్నారు.

31న బండలాగుడు పోటీలు

జాతరను పురస్కరించుకుని ఈనెల 31న ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. మొదటి బహుమతి రూ.60వేలు, రెండో బహుమతి రూ.50వేలు, మూడో బహుమతి రూ.40వేలు, నాలుగో బహుమతి రూ.30వేలు, ఐదో బహుమతి రూ.20వేలను అందించనున్నట్లు తెలిపారు.

29, 30న కబడ్డీ, వాలీబాల్ పోటీలు

జాతర మైదానంలో ఈనెల 29, 30న రెండు రోజుల పాటు గ్రామానికి చెందిన పాశం చెన్నమ్మ జ్ఞాపకార్థం ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9704831682 ఫోన్ చేసి పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు. మొదటి బహుమతి కింద రూ.25వేలు, రెండో బహుమతి కింద రూ.18వేలు, మూడో బహుమతి కింద రూ.10వేలు, నాలుగో బహుమతి కింద రూ.5వేలను అందించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రెండు రోజుల పాటు వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు చెప్పారు.

బాలికలు అన్ని రంగాల్లో సత్తా చాటాలి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: బాలికలు అన్ని రంగాల్లో రాణించి సత్తా చాటాలని పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కప్లాపూర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ లర్నింగ్ మెటీరియల్ ఎక్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బాలికల సంరక్షణకోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. అలాగే రక్తహీనతతో బాధపడుతున్న వారికి న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేస్తుందన్నారు. అంగన్‌వాడీల్లో పోషకాహారం సైతం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాధవి, ఎంపీటీసీ శైలజ, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, సర్పంచ్ జ్యోతి, సూపర్‌వైజర్ రాధిక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బెయిల్ కోసం వస్తే స్టేషన్‌లో పెడతారా!

జడ్చర్ల టౌన్: హైకోర్టు యాంటిసిపేటరి బెయిల్ మంజూరు చేసినందున పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి షూ్యరిటీ ఇచ్చి బెయిల్ తీసుకుందామని వచ్చిన మోహన్‌ను స్టేషన్‌లోనే ఎందుకు ఉంచుకున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఉన్న ఆయనను అనిరుధ్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ 3న తిర్మలాపూర్‌కి చెందిన విద్యార్థిని జయశ్రీ మృతి జరిగిందని, ఆమె మృతదేహంతో జడ్చర్లలో రాస్తారోకో నిర్వహించామన్నారు. తమతోపాటు బీఆర్‌ఎస్ ఎంపీటీసీ, సర్పంచ్‌లు అందులో పాల్గొన్నారని తెలిపారు. అయితే బీఆర్‌ఎస్ వారిని వదిలిపెట్టి తనతోపాటు తన అనుచరులైన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. తాము హైకోర్టును ఆశ్రయించి యాంటిసిపేటరి బెయిల్ తెచ్చుకున్నామన్నారు. బెయిల్ పేపర్లను అందించి స్యూరిటి ఇచ్చి బెయిల్ పొందేందుకు మోహన్ మంగళవారం రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారన్నారు. స్టేషన్‌కు వెళ్లగా అక్కడినుంచి జడ్చర్ల పోలీస్‌స్టేషన్ తీసుకొచ్చారని, రాత్రి మహబూబ్‌నగర్ తరలించి ఉదయం మళ్లీ ఇక్కడకు తెచ్చారన్నారు. 24గంటలు గడిచినా తమ అదుపులో ఎందుకు ఉంచుకున్నారో తెలియకుండా ఉందన్నారు. కోర్టు బెయిల్ ఇచ్చినా వారు ఎందుకు వదలడం లేదని నిలదీశారు. రాజాపూర్ మండలంలో ఒక వెంచర్‌కు సంబంధించిన లావాదేవీల విషయంలో పోలీసులు జోక్యం చేసుకున్నారని, మోహన్ బయటే ఉంటే అది సాధ్యమ కాదని అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఈ విషయంలో తాము మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయించనున్నట్లు తెలిపారు.

మనికొండను మండలంగా ప్రకటించాలి

కోయిల్‌కొండ: మనికొండ చుట్టూ పక్కల గ్రామాలను అనుసంధానం చేస్తూ పాలన సౌలభ్యం కోసం మనికొండ గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని కేశ్వాపూర్, పేర్కివీడు సర్పంచ్‌లు మొగులయ్య, రాఘవేందర్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గోరి రాజేశ్వరిసతీష్‌లు కోరారు. ఎక్కువ జనాభా ఉన్న మనికొండను మండలం చేయడం ద్వారా రాంచంద్రపురం, మాచన్‌పల్లి, రాజునాయక్‌తండా, స్లోమానాయక్‌తండా, కేశ్వాపూర్, పేర్కివీడు గ్రామాలు అభివృద్ధి జరుగుతాయన్నారు. కావున ప్రభుత్వం ఆలోచించి మనికొండను మండలంగా ప్రకటించాలని వారు కోరారు.

భాషాపండితులు, పీఈటీల నిరసన


నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జడ్చర్ల టౌన్: భాషాపండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం టీపీయూఎస్ ఆధ్వర్యంలో బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో నల్లబ్యాడ్జిలు ధరించి ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే భాషాపండితులు, పీఈటీల సమస్యలను పరిష్కరించాలన్నారు. బదిలీలు, పదోన్నతులకు ముందే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీయూఎస్ మండల కార్యదర్శి కృష్ణయ్య, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వివేకానంద, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

8 గొర్రెలు ఎత్తుకెళ్లిన దుండగులు

మిడ్జిల్: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి బుడుగు నాగయ్యకు చెందిన 8 గొర్రెలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన్నట్లు బాధితులు తెలిపారు. మినీ బోలెరాలో వచ్చి గొర్రెలను చోరీ చేస్తుండగా కాపారి నాగయ్య కేకలు వేయడంతో దొంగలు చేతికి అందిన 8 గొర్రెలను తమ వెంట తెచ్చిన వాహనంలో తీసుకొని పరారైన్నట్లు బాధితుడు తెలిపారు. బుధవారం బాధితుడు మిడ్జిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.80 వేల వరకు ఉంటుందని నాగయ్య తెలిపారు.

విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ తర్వాత విద్యార్థుల కెరీర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ ప్రదీప్ కృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఈనెల 29న శంషాబాద్ ఐఏఎస్ అకాడమీలో 'పిల్లలు సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ఎలా ' అనే అంశంపై ఉదయం 9 నుంచి 1గంట వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ, ఓయూ ప్రిన్సిపాల్ చింత గణేష్, వ్యక్తిత్వ వికాస నిపుణులు సుధీర్ సంద్రలు పాల్గొననున్నట్లు తెలిపారు. మరింత సమాచారం కోసం నంబర్.9133437799ను సంప్రదించాలన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నీ ప్రారంభం



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని రామయ్యబౌలీలో రెండు రోజలపాటు జరిగే అమరవీరుల స్మారక జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. టోర్నీ ఆర్గనైజర్ ఎండీ మతీన్‌ఉర్ రెహమాన్ మాట్లాడుతూ వాలీబాల్ టోర్నీలో 26 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మక్బూల్ అహ్మద్, సయ్యద్ సుల్తాన్, మహ్మద్ అజహర్, సనా అహ్మద్, మహ్మద్ మేరాజ్, మక్సూద్, ఎంఏ నవీద్, షోయబ్, సయ్యద్ అమాన్, షోయబ్ ఖాన్, ఎండీ సోహైల్, పాష, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


కొత్తూర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

భూత్పూర్: సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమంతో పాటు అనేక సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొత్తూర్, కరివెన, లంబడికుంటతండా గ్రామ పంచాయతీలకు నూతనంగా మంజూరైన భవనాలకు, సీసీ రోడ్లకు శంకుస్థాపన, మున్సిపాలిటీలోని గోప్లాపూర్‌లో రెండవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, పాల్గొన్నారు.

రాజాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో బుధవారం 159 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. నేటి వరకు మొత్తం 845 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ రావ్ తెలిపారు. అంతేకాకుండ కంటివెలుగు కార్యక్రమానికి తహసీల్దార్ రాంబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

నవాబుపేట: కంటి వెలుగును వినియోగించుకోవాలని జిల్లా వైద్యాఆరోగ్య శాఖ అధికారి కృష్ణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంతో పాటు కొల్లూర్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమాలను ఆయన పరిశీలించారు.

మిడ్జిల్: మండల పరిధిలోని ఈదులబావితండాలో కంటి వెలుగు కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ సాయిలక్ష్మి బృందం పరిశీలించారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలో బుధవారం పది కంటి వెలుగు కేంద్రాల్లో 2,189 మందికి కంటి పరీక్షలు చేయగా 339 మందికి అద్దాలు పంపిణీ చేశారు.


న్యూమోతినగర్‌లోని హైస్కూల్‌లో కంటి వెలుగుకు వచ్చిన ప్రజలు


నవాబుపేటలో పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ కృష్ణ

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


కొండ్రెడ్డిపల్లిలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి

మహమ్మదాబాద్: విద్యార్థులకు పదోతరగతితోనే దశాదిశా నిర్దేశం మొదలవుతుందని రంగారెడ్డి జిల్లా చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం బీఎంఆర్ ట్రస్టు తరపున మండలంలోని నంచర్ల, జూలపల్లి, మహమ్మదాబాద్ బాలుర, బాలికల అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 400 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి, రైతుసమన్వయ సమితి అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, కేఎం అనసూయ నారాయణ, కిరణకుమార్‌రెడ్డి, డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

గండేడ్: చదువుకు పేదరికం అవరోధం కారాదని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కొండ్రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బీఎంఆర్ ఫౌండేషన్ నుంచి ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, జూలపల్లి సర్పంచ్ కిరణ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ టోర్నీ ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని రామయ్యబౌలీలో రెండు రోజల పాటు జరిగే అమరవీరుల స్మారక జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ బుధవారం ప్రారంభమైంది. టోర్నీ ఆర్గనైజర్ ఎండీ మతీన్‌ఉర్ రెహమాన్ మాట్లాడుతూ వాలీబాల్ టోర్నీలో 26 జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. టోర్నీలో విజేత జట్టుకు రూ.15వేలు, ద్వితీయ జట్టుకు రూ.10వేలు, మూడోస్థానం జట్టుకు రూ.5వేలు నగదు పారితోషికం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మక్బూల్ అహ్మద్, సయ్యద్ సుల్తాన్, మహ్మద్ అజహర్, సనా అహ్మద్, మహ్మద్ మేరాజ్, మక్సూద్, ఎంఏ నవీద్, షోయబ్, సయ్యద్ అమాన్, షోయబ్ ఖాన్, ఎండీ సోహైల్, పాష, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

గండేడ్: బైక్‌పై నుంచి ప్రమాదవశాత్తు మహిళ కింద పడి మృతి చెందింది. మండలంలోని కొండ్రెడ్డిపల్లి చెందిన దొంగల మల్లమ్మ (48) బుధవారం ఉదయం పొలానికి వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బైక్‌పై గండేడ్ వెళ్తుండగా, అతన్ని సాయం అడిగి బైక్ ఎక్కింది. కొద్ది దూరం వెళ్లగానే ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడింది. తీవ్రంగా గాయపడ్డ ఆమెను అంబులెన్సులో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.